క్లుప్తంగా

'మీ కాలనీ వద్దే విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చు'

జగద్గిరిగుట్ట: సమయానికి విద్యుత్ బిల్లులు చెల్లించి సహకరించాలని జగద్గిరిగుట్ట సబ్ స్టేషన్ ఏఈఈ రాధాకిషన్ అన్నారు. సబ్ స్టేషన్ పరిధిలో 13వ తేదీన భగత్‌సింగ్‌నగర్ గవర్నమెంట్ స్కూల్ వద్ద , 14వ తేదీన దేవమ్మ బస్తీ గణేష్ మండపం వద్ద, 15వ తేదీన రాజీవ్ గృహకల్ప, సంజయ్‌పురి కాలనీలలో కమ్యూనిటీ హాల్ వద్ద బిల్లులు చెల్లించవచ్చని తెలిపారు.

మేడ్చల్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడికి సన్మానం



బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పవన్‌కుమార్‌ను సత్కరిస్తున్న కూన శ్రీశైలంగౌడ్

కుత్బుల్లాపూర్: మేడ్చల్ కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా నియమితులైన పాలకుర్తి పవన్‌కుమార్‌ను మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నేత కూన శ్రీశైలంగౌడ్ సత్కరించారు. శుక్రవారం షాపూర్ నగర్ లోని ఆయన నివాసంలో శాలువాతో సత్కరించి అభినందించారు. అదేవిధంగా హైకోర్టు జీపీ ప్రవీణ్‌గౌడ్, బీజేపీ లీగల్ సెల్ ప్రతినిధి రాధాకృష్ణ, రాఘవేందర్‌గౌడ్‌లు శ్రీశైలంగౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకోగా వారికి సన్మానం చేశారు. కేకేఎం ట్రస్ట్ చైర్మన్ కూన శ్రీనివాస్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

కాలనీల్లో ఫాగింగ్ చేయండి

జీడిమెట్ల: కాలనీల్లో దోమల బెడద విపరీతంగా ఉందని ఫాగింగ్ చేయాలని సుభాష్‌నగర్ డివిజన్ వాసులు కోరుతున్నారు. డివిజన్ పరిధిలోని ఎస్.ఆర్.నాయక్‌నగర్, అపురూపాకాలనీ, అయోధ్యనగర్, పాండుబస్తీ, సాయి బాబానగర్‌లలో దోమలు ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయని కాలనీవాసులు అంటున్నారు. రెండు నెలలుగా ఎంటమాలజీ సిబ్బంది కాలనీల్లో ఫాగింగ్ చేయడం లేదని ప్రజలు మున్సిపల్ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎండాకాలం ఇంత పెద్ద మోతాదులో దోమలు ఉండటం ఇదే మొదటిసారిని ప్రజలు అంటున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు పట్టించుకుని కాలనీల్లో ఫాగింగ్ చేయాలని కోరుతున్నారు.

వైభవంగా పంచమ వార్షికోత్సవాలు



హోమం నిర్వహిస్తున్న అర్చకులు

జగద్గిరిగుట్ట: జగద్గిరిగుట్టలోని శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి గుట్టపై వెలసిన శ్రీమార్కండేశ్వర స్వామి ఆలయ పంచమ వార్షికోత్సవాలు శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు డాక్టర్ నోముల రమేష్‌రుషి స్వామివారికి పూజలు నిర్వహించారు. స్థానిక కార్పొరేటర్ కొలుకుల జగన్, పద్మశాలి సంఘం అధ్యక్షుడు బేతిగోపాల్, జగద్గిరిగుట్ట బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రుద్రఅశోక్, ఎరువ శంకరయ్య హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో జగద్గిరిగుట్ట ఆలయ కమిటీ చైర్మన్ మునిపల్లి జనార్దన్, కమిటీ సభ్యులు భోగ రాజేష్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే తెలంగాణ అభివృద్ధి సాధ్యం

టీపీసీసీ ప్రతినిధి కొలన్ హన్మంతరెడ్డి


కుత్బుల్లాపూర్: కాంగ్రెస్ పార్టీతోనే తెలంగాణ అభివృద్ధి సాధ్యమని టీపీసీసీ ప్రతినిధి కొలన్ హన్మంతరెడ్డి అన్నారు. హాథ్ సే హాథ్ పాదయాత్రలో భాగంగా శుక్రవారం జీడిమెట్ల డివిజన్ పరిధిలోని వెన్నెలగడ్డ, బౌద్ధనగర్, వెంకటేశ్వర కాలనీ, రామరాజునగర్ ప్రాంతాల్లో పర్యటించిన ఆయన కాంగ్రెస్‌పార్టీ కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం హన్మంతరెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే జాబ్ కేలండర్ విడుదల చేసి ఉద్యోగాలను భర్తీ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు శ్రవణ్‌కుమార్, నాయకులు శ్రీనివాస్, సంపత్‌గౌడ్, పుల్లెంరాజు, జేమ్స్, సంజీవరెడ్డి, నార్సింగ్, పండరి పాల్గొన్నారు.

రోగుల చికిత్సలో నర్సుల పాత్ర కీలకం

నిజాంపేట్: రోగుల చికిత్సలో నర్సుల పాత్ర చాలా కీలకమని, వారు అందించే సేవల వల్లే రోగులు త్వరగా కోలుకుంటున్నారని ఎస్ఎల్‌జీ ఆస్పత్రి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డీవీఎస్ సోమరాజు అన్నారు. శుక్రవారం బాచుపల్లిలోని ఎస్ఎల్‌జీ ఆస్పత్రిలో అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి నర్సులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సోమరాజు మాట్లాడుతూ... వైద్యులు అందించే చికిత్స ఒక ఎత్తయితే, ఆ తర్వాత వారు కోలుకోవడానికి నర్సింగ్ సిబ్బంది అందించే సేవలు మరో ఎత్తన్నారు. ఆస్పత్రికి చెందిన నర్సింగ్ స్టాఫ్ నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఎస్ఎల్‌జీ వైద్య సిబ్బంది, యాజమాన్యం ప్రతినిధులు పాల్గొన్నారు.

'టెక్'నాలెడ్జి వైపు..

- కార్పొరేట్‌కు దీటుగా పాఠశాల విద్య బలోపేతమే లక్ష్యం
- శివారు జిల్లాల్లో 1,454 ప్రభుత్వ పాఠశాలలకు ట్యాబ్‌లు
- ఈ విద్యా సంవత్సరంలో అందజేసేందుకు ఏర్పాట్లు



సాక్షి, మేడ్చల్ జిల్లా: కార్పొరేట్ విద్యకు దీటుగా సర్కారు విద్యను బలోపేతం చేసేందుకు మన ఊరు–మన బడి కార్యక్రమం కింద అదనపు తరగతి గదుల నిర్మాణం, మరమ్మతులు వంటి పనులతో బడుల సుందరీకరణ చర్యలు చేపడుతున్న ప్రభుత్వం వాటిని మరింత ఆధునికరించే దిశగా ట్యాబ్‌ల పంపిణీతో ముందడుగు వేస్తోంది. ప్రభుత్వ పాఠశాలల్లో చేరుతున్న విద్యార్థులు.. కరోనా తదితర కారణాల నేపథ్యంలో కనీస సామర్థ్యాన్ని సాధించలేకపోయారని గుర్తించిన సర్కారు ఎఫ్ఎస్ఎన్ కార్యక్రమం కింద ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తోంది. ఈ నేపథ్యంలోనే సర్కారు బడులకు ట్యాబ్‌లు పంపిణీ చేయటంతోపాటు ఈ విద్యా సంవత్సరం నుంచి విద్యార్థులు, ఉపాధ్యాయులకు వాటిని అందుబాటులోకి తేచ్చేందుకు కసరత్తు చేస్తోంది. ఎఫ్ఎస్ఎన్ కార్యక్రమం కింద తొలి విడతలో రాష్ట్ర వ్యాప్తంగా గుర్తించిన 19,800 ప్రాథమిక(పీఎస్), ప్రాథమికోన్నత పాఠశాల(యూపీఎస్)లకు విద్యార్థుల సంఖ్యను అనుసరించి ట్యాబ్‌లను అందజేసేందుకు చర్యలు తీసుకుంటోంది. అందులో భాగంగా నగర శివారు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 397, రంగారెడ్డి జిల్లాలో 1,057 ప్రభుత్వ పాఠశాలలకు ట్యాబ్‌లు పంపిణీ చేసే ప్రక్రియలో భాగంగా సంబంధిత విద్యాశాఖలకు వాటిని ఇప్పటికే చేరవేసింది.

బడుల సమాచారం ఇక జాగ్రత్త

నగర శివారు మేడ్చల్-మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల్లో ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల భవనాల్లో కొన్ని శిథిలావస్థకు చేరాయి. అలాగే.. పాఠశాలలకు సంబంధించిన విద్యార్థుల ప్రవేశ రిజిష్టర్లు, రికార్డులు, మార్కుల వివరాలు, ఉపాధ్యాయుల సమాచారం అంతా రాతపూర్వకంగా ఉండటంతో.. కొంత కాలానికి అవసరమైన సమాచారం దొరక్కపోవచ్చనే అనుమానాలు లేకపోలేదు. ఈ నేపథ్యంలోనే విద్యార్థికి వచ్చిన మార్కులు, సహ పాఠ్యాంశ ప్రణాళిక అమలులో విద్యార్థి ప్రతిభ తదితర విషయాలు, విద్యార్థి ప్రవేశ సంఖ్య, పాఠశాల వదిలివెళ్లిన తేదీ తదితర వివరాలన్నీ ట్యాబ్‌లో నిక్షిప్తం చేయనున్నట్లు తెలుస్తోంది. వీటి నిర్వహణ, సంరక్షణ బాధ్యత కూడా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చూసుకోవాల్సి ఉంటుంది. ఇప్పటికే మన ఊరు- మనబడి-మన బస్తీ కార్యక్రమం కింద ప్రభుత్వ పాఠశాలలను అందంగా తీర్చిదిద్దడం, బోధనలో నూతనత్వాన్ని పరిచయం చేయడంతో విద్యార్థులు, సమాజం విశ్వాసాన్ని పొందాయి. ఈ విద్యా సంవత్సరం నుంచి ఇవి మరింత పూర్వ వైభవాన్ని సంతరించుకుంటాయనడంలో సందేహం అవసరం లేదని విద్యా విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

ఉపాధ్యాయులకు శిక్షణ

పాఠశాల విద్యకు సంబంధించిన సమాచారాన్ని ప్రస్తుతం ఉపాధ్యాయులు తమ ఫోన్ ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తున్నారు. ఈ విద్యాసంవత్సరం నుంచి ప్రధానోపాధ్యాయులు ట్యాబ్‌ల ద్వారా బడుల సమాచారాన్ని ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి నివేదించటానికి అవకాశం ఉంటుంది. వీటి నిర్వహణ విషయంలో ఉపాధ్యాయులకు సంబంధిత నిపుణులతో శిక్షణ కూడా ఇప్పించారు.

నేటి నుంచి ఆర్టీసీ బస్సు రూట్లు మార్పు

- 3 నెలల పాటు కొనసాగింపు
- నేటి నుంచి ఆగష్టు 10 వరకు..
- శిల్పా లేఅవుట్ ఫేజ్–2 ఫ్లైఓవర్ పనుల నేపథ్యంలో రోడ్డు మూసివేత

రాయదుర్గం: ఆర్టీసీ బస్సు రూట్లు మారాయి. జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో శిల్పా లేఅవుట్ ఫేజ్–2 ఫ్లైఓవర్ నిర్మాణ పనులు చేపడుతున్న నేపథ్యంలో గచ్చిబౌలి జంక్షన్ నుంచి కొండాపూర్ రోడ్డును 90 రోజులపాటు మూసివేస్తున్న నేపథ్యంలో ఈ మార్పులకు ఆర్టీసీ సంస్థ శ్రీకారం చుట్టింది. ఈ నెల 13వ తేదీ నుంచి ఆగస్టు 10 వ తేదీ వరకు ఈ మార్పు అమలులో ఉంటాయి.

- రూట్ నంబర్ 216కె/ఎల్ బస్సును లింగంపల్లి నుంచి మెహిదీపట్నం వెళ్ళే బస్సు... రాడిసన్ హోటల్ ఎక్స్‌రోడ్డు నుంచి మీనాక్షి టవర్స్, ఐకియా, బయోడైవర్సిటీ ఎక్స్ రోడ్డు రూట్ ద్వారా రాకపోకలు జరుగుతాయి.
- రూట్ నంబర్ 221 బస్సు మియాపూర్ మెట్రో స్టేషన్ నుంచి మంచిరేవుల బస్సును... రాడిసన్ హోటల్, డీఎల్ఎఫ్, ట్రిపుల్‌ఐటీ క్రాస్ రోడ్స్ నుంచి గచ్చిబౌలి వరకు రాకపోకలు జరుగుతాయి.
- రూట్ నంబర్ 10 హెచ్‌డబ్ల్యూ బస్సు సికింద్రాబాద్ నుంచి వేవ్‌రాక్.. బస్సును రాడిసన్ హోటల్, డీఎల్ఎఫ్, ట్రిపుల్‌ఐటీ క్రాస్ రోడ్స్, విప్రో సర్కిల్ మీదుగా రాకపోకలు చేస్తాయి.
- ఈ రూట్ మార్పులను 90 రోజులపాటు అమలు చేస్తామని, ప్రయాణికులు గమనించాలని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ఆర్టీసీ డిపో మేనేజర్ పి శ్రీనివాస్ శుక్రవారం తెలిపారు.

సోలార్ విద్యుత్ ప్లాంట్లను ఏర్పాటు చేసుకోవాలి



250 కిలోవాట్ సోలార్ పవర్ ప్లాంట్‌ని ప్రారంభించిన చైర్మన్ సతీష్‌రెడ్డి, ఎమ్మెల్యే గాంధీ

మాదాపూర్: గేటెడ్ కమ్యూనిటీలు సోలార్ విద్యుత్ ప్లాంట్లను ఏర్పాటు చేసుకోవాలని తెలంగాణ రాష్ట్ర పునరుత్పాదక శక్తి అభివృద్ధి సంస్థ చైర్మన్ వై. సతీష్‌రెడ్డి పేర్కొన్నారు. మాదాపూర్‌లోని ఫార్చ్యూన్ టవర్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన 250 కిలోవాట్ సోలార్ పవర్ ప్లాంట్‌ని స్థానిక ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, రెడ్కో వైస్ చైర్మన్ జానయ్యతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వై. సతీష్‌రెడ్డి మాట్లాడుతూ భవిష్యత్తు బాగుండాలి, కాలుష్యం నివారించాలనే ఉద్దేశ్యంతో తీసుకున్న ఈ నిర్ణయం ఇతర గేటెడ్ కమ్యూనిటీలకు స్ఫూర్తిదాయకమన్నారు. రాష్ట్రాన్ని గ్రీన్ ఎనర్జీలో నంబర్ వన్‌గా చేసే లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. పర్యావరణాన్ని కాపాడవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. పట్టణాలలో కాలుష్యం ఎక్కువగా ఉంటుందని పునరుత్పాదక శక్తి వైపు మళ్ళాల్సిన ఆవశ్యకత చాలా ఎక్కువగా ఉందన్నారు. రూఫ్‌టాప్ ప్యానెల్స్‌ను పెడితే పై కప్పుకూడా వేడెక్కడం తగ్గడంతో పాటు విద్యుత్ వినియోగం, విద్యుత్ బిల్లుల భారం కూడా తగ్గుతుందన్నారు. కార్యక్రమంలో తెలంగాణ సోలార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ అశోక్‌గౌడ్, ఫార్చ్యూన్ టవర్స్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మాగంటి సత్యనారాయణ, సెక్రటరీ శ్రీనివాస్, ట్రెజరర్ రామారావు, సభ్యులు, రెడ్కో అధికారులు పాల్గొన్నారు.

పేదలకు డబుల్ ఇళ్లు ఇచ్చే వరకు పోరాడతాం

- మేడ్చల్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు పన్నాల హరీష్‌రెడ్డి
- లబ్ధిదారులకు డబుల్ ఇళ్లను వెంటనే ఇవ్వాలని డిమాండ్

మూసాపేట: తెలంగాణలో పేదల కోసం డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇస్తామంటూ సీఎం కేసీఆర్ తొమ్మిదేళ్లుగా మోసం చేస్తున్నారని బీజేపీ సీనియర్ నాయకులు ఆరోపించారు. కేంద్రం 2.5 లక్షల ఇళ్లు మంజూరు చేస్తే, కేసీఆర్ సర్కార్ లెక్కల ప్రకారం కేవలం 7వేల ఇళ్లు మాత్రమే ఇచ్చి కాలయాపన చేస్తోందని విమర్శించారు. డబుల్ బెడ్ ఇళ్ల కేటాయింపులో కేసీఆర్ సర్కార్ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ గురువారం మూసాపేటలో బీజేపీ కూకట్‌పల్లి అసెంబ్లీ ఇన్‌చార్జ్ మాధవరం కాంతారావు ఆధ్వర్యంలో ఆత్మగౌరవ దీక్ష శుక్రవారం ముగిసింది.

- అనంతరం మేడ్చల్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు పన్నాల హరీష్‌రెడ్డి, మాధవరం కాంతారావు, వడ్డేపల్లి రాజేశ్వరరావు, అర్సనపల్లి సూర్యారావులు శుక్రవారం మూసాపేటలోని జీహెచ్ఎంసీ కార్యాలయంలో డీసీకి వినతిపత్రం అందజేశారు. పేదల కోసం కేంద్రం మంజూరు చేసిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను కేసీఆర్ సర్కార్ వెంటనే అందజేయాలని ఆ వినతి పత్రంలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తొమ్మిదేళ్ల నుంచి రాష్ట్ర ప్రభుత్వం ఇళ్లు ఇవ్వకుండా పేదలను ఆర్థికంగా, మానసికంగా ఇబ్బంది పెడుతోందన్నారు. డబుల్ బెడ్‌రూం ఇళ్లు మంజూరు చేసే వరకు బీజేపీ పోరాటం ఆగదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మూసాపేట కార్పొరేటర్ మహేందర్, నాయకులు శ్రీకర్‌రావు, పద్మయ్య, పిట్ల మనోహర్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నాం



శివసాయిహిల్స్‌లో సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్: కుత్బుల్లాపూర్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసే దిశగా పని చేస్తున్నామని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. ప్రగతియాత్రలో భాగంగా గాజులరామారం డివిజన్ పరిధి శివసాయిహిల్స్, బతుకమ్మబండ ప్రాంతాల్లో పర్యటించి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామని అన్నారు. దశలవారీగా అన్ని ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని పేర్కొన్నారు. జలమండలి డీజీఎం అప్పలనాయుడు, ఏఈ కళ్యాణ్, మేనేజర్ రోహిణి, బీఆర్ఎస్ నాయకులు రషీద్ బైగ్, కస్తూరి బాల్‌రాజ్, పీఏసీఎస్ డైరెక్టర్ పరుష శ్రీనివాస్ యాదవ్, తదితరులు ఉన్నారు.

రేపు హనుమాన్ చాలీసా పారాయణం

చింతల్: డివిజన్ పరిధిలోని భగత్‌సింగ్‌నగర్ శ్రీవీరాంజనేయస్వామి ఆలయంలో ఈనెల 14న తృతీయ అఖండ హనుమాన్ చాలీసా పారాయణాన్ని నిర్వహించనున్నారు. ఉదయం 7గంటల నుంచి రాత్రి 7గంటల వరకు కొనసాగే హనుమాన్ చాలీసా పారాయణంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని శ్రీధర్మశాస్త్ర సేవా సమితి కోరింది.

చెరువులో దూకి వ్యక్తి ఆత్మహత్య



మృతుడు దుర్గారావు

కుత్బుల్లాపూర్: అనారోగ్యంతో బాధపడుతున్న ఓ వ్యక్తి చెరువులోకి దూకి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగు చూసింది. పోలీసుల సమాచారం మేరకు... కొంపల్లిలోని ఎన్‌సీఎల్ నార్త్ అపార్ట్‌మెంట్స్‌లో వాచ్‌మెన్‌గా పని చేస్తున్న దుర్గారావు(38), అనురాధ దంపతులు. గడచిన రెండేళ్లుగా ఆరోగ్యం సరిగా లేకపోవడంతో దుర్గారావు మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెందిన ఆయన ఈ నెల 10వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లి జయభేరి పార్కులోని చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మర్యాదపూర్వక కలయిక



ఎంపీ రేవంత్‌రెడ్డితో బైరి ప్రశాంత్‌గౌడ్

కుత్బుల్లాపూర్: కొంపల్లి మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బైరి ప్రశాంత్‌గౌడ్ శుక్రవారం టీపీసీసీ ప్రెసిడెంట్ రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శులు భూపతిరెడ్డి, కందాడి జ్యోత్స్న శివారెడ్డితో పాటు కౌన్సిలర్లు శివకుమార్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ గోపాల్‌రెడ్డి, ఆదిరెడ్డి సురేందర్‌రెడ్డి, కోఆప్షన్ మెంబర్ షేక్ ఇబ్రహీం ఉన్నారు.

దుండిగల్: టీపీసీసీ దుండిగల్ మున్సిపల్ అధ్యక్షుడు మద్దికుంట నవీన్‌రెడ్డి శుక్రవారం టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి ఆధ్వర్యంలో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గాజులరామారం సర్కిల్ 126 డివిజన్‌కు చెందిన అరుణ్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలో తన అనుచరులతో కలిసి చేరారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బొంగునూరి శ్రీనివాస్ రెడ్డి, జిల్లా కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడు సదానందం, బౌరంపేట్ మాజీ సర్పంచ్ మిద్దెల యాదిరెడ్డి, ఏఐసీసీ హ్యూమన్ రైట్స్ రాష్ట్ర యువజన అధ్యక్షుడు రాధాకృష్ణ, ఫిషర్మెన్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి పోషి మహేశ్ తదితరులు ఉన్నారు.

ఉత్తమ బోధనతో మంచి విద్య అందుతుంది

రాయదుర్గం: సమర్థవంతమైన బోధనతో నాణ్యమైన విద్య అందుతుందని మిచిగాన్ స్టేట్ యూనివర్శిటీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఖాజీ సిరాజ్‌అజర్ పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని మనూ ఉర్దూ విశ్వవిద్యాలయంలో ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ఆసక్తి కలగజేయడం ఉపాధ్యాయులకు అతిపెద్ద, ప్రధానమైన సవాలు అని అన్నారు. వీసీ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్ మాట్లాడుతూ అభివృద్ధిలో అందరూ తమ వంతు పాత్ర పోషించాలన్నారు. అనంతరం డాక్టర్ రుబీనా రచించిన 'వ్యక్తిత్వ వికాసంలో సహపాఠ్య కార్యక్రమాల పాత్ర' పేరుతో ప్రచురించిన పుస్తకాన్ని వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్ ఆవిష్కరించారు.

హెచ్‌సీయూలో విదేశీ బృందం

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీని మాల్దీవుల నుంచి జర్నలిస్టులు/సంపాదకుల ప్రతినిధి బృందం శుక్రవారం సందర్శించారు. భారత ప్రభుత్వ విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఈ పర్యటన సాగింది. పునరుత్పాదక ఇంధనం, పరిశ్రమలు, రక్షణ, పాలన, ఐటీ సేవలు, విద్య, ఫార్మాస్యూటికల్స్ రంగాలలో భారతదేశం సాధించిన విజయాలను విదేశీ మీడియాకు పరిచయం చేయడమే లక్ష్యంగా ఈ పర్యటన సాగింది. మాల్దీవుల ప్రతినిధి బృందానికి హెచ్‌సీయూ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ బీజేరావు ఆధ్వర్యంలో స్వాగతం పలికారు.

అనుమానాస్పదస్థితిలో యువతి అదృశ్యం



దివ్య (ఫైల్)

కుత్బుల్లాపూర్: అనుమానాస్పదస్థితిలో ఓ యువతి అదృశ్యమైన ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పేట్‌బషీరాబాద్‌కు చెందిన బాలయ్య కుమార్తె దివ్య (22) స్థానికంగా ఐసీఐసీఐ బ్యాంక్ ఉద్యోగి. కాగా రోజు మాదిరిగానే ఈనెల 10న ఉదయం డ్యూటీకి వెళ్లిన దివ్య మధ్యాహ్నం ఒంటి గంటకు ఇంటికి వచ్చి తన ఆఫీస్‌లో పనిచేసే ఉద్యోగి పెళ్లి ఉందని చెప్పి వెళ్లింది. రాత్రి 7 గంటలైనా ఇంటికి రాకపోవడంతో ఆమె సెల్‌ఫోన్‌కు ప్రయత్నించగా స్విచ్ఛాఫ్ వచ్చింది. బ్యాంక్‌లో ఆరా తీయగా ఆస్పత్రికి వెళ్తున్నానని పర్మిషన్ తీసుకున్నట్లు తెలిసింది. బంధువులు, స్నేహితుల ఇళ్లల్లో వెతికినా ఫలితం లేకపోవడంతో శుక్రవారం బాలయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

దివ్యాంగురాలి అదృశ్యం



రేణుక (ఫైల్)

కుత్బుల్లాపూర్: తండ్రితో గొడవపడిన కూతురు ఇంటి నుంచి వెళ్లిపోయిన ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మైసమ్మగూడకు చెందిన కూలి పనులు చేసే యాదయ్య కుమార్తె రేణుక(30)కు పుట్టుకతోనే చెవిటి మూగ ఉన్నాయి. కాగా ఈనెల 10వ తేదీన మధ్యాహ్నం 2గంటల ప్రాంతంలో తండ్రితో గొడవ పడిన రేణుక ఇంటి నుండి వెళ్లిపోయింది. బంధువుల ఇళ్లల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో శుక్రవారం కుటుంబీకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి మత్తులో యువకుడి హల్‌చల్



రోడ్డుపై రక్తం మరకలతో మహేష్

జగద్గిరిగుట్ట: ఓ వ్యక్తి గంజాయి సేవించిన మత్తులో గొంతు కోసుకుని రోడ్డుపై హల్‌చల్ చేసిన సంఘటన జగద్గిరిగుట్ట పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికుల వివరాల ప్రకారం.. జగద్గిరిగుట్ట దీనబంధు కాలనీకి చెందిన మహేష్(23) దొరికిన పని చేస్తూ వచ్చిన డబ్బుతో గంజాయి తాగుతుంటాడు. గురువారం రాత్రి గంజాయి మత్తులో మహేష్ తన బంధువులు తనకు అన్యాయం చేసారంటూ రోడ్డుపైకి వచ్చి అరుస్తూ బ్లేడుతో గొంతుకోసుకున్నాడు. అనంతరం తూగుతూ రోడ్డుపై నడుస్తూ పొంతనలేని మాటలు మాట్లాడుతూ వాహనాలకు అడ్డుగా నిలిచాడు. రక్తం మరకలతో ఉన్న మహేష్‌ను చూసిన స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. అనంతరం స్థానికులు పట్టుకుని చికిత్స కోసం మహేష్‌ను ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం మహేష్ ఆరోగ్యం నిలకడగానే ఉన్నట్లు డాక్టర్లు తెలిపారు.

అభివృద్ధి పనులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

మంత్రి చామకూర మల్లారెడ్డి



సాక్షి, మేడ్చల్ జిల్లా: పురపాలక సంఘాలు, గ్రామ పంచాయతీల్లో కొనసాగుతున్న అభివృద్ధితో పాటు పెండింగ్ పనులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ అమయ్ కుమార్ ఆధ్వర్యంలో మేడ్చల్ నియోజకవర్గానికి సంబంధించిన అభివృద్ధి, పెండింగ్ పనులపై మేయర్లు, మున్సిపల్ చైర్మన్లు, తహశీల్దార్లు, కమిషనర్లు, సంబంధిత శాఖల అధికారులతో ఆయన సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. అభివృద్ధి పనులకు సంబంధించి నిధులకు ఏమాత్రం కొరత లేదని చేపట్టాల్సిన పనులను సకాలంలో పూర్తి చేసేలా అవసరమైన ముందస్తు కార్యాచరణతో ముందుకు సాగాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో మేడ్చల్ నియోజకవర్గం అన్ని రంగాల్లో మొదటి స్థానంలో ఉందని, పురపాలక సంఘాల్లో జరుగుతున్న అభివృద్ధి, పెండింగ్ పనులపై మేయర్లు, మున్సిపల్ చైర్మన్లు, కమిషనర్లు, తహశీల్దార్లు ప్రత్యేక శ్రద్ధతో పని చేయాలన్నారు.

నిధులను మంజూరు చేసేందుకు కృషి

పురపాలక సంఘాల్లో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, రహదారులు, వెజ్- నాన్‌వెజ్ మార్కెట్లు, వైకుంఠధామాలు, డంపింగ్ యార్డులు, దోబీఘాట్లు, స్టేడియం తదితర అన్ని రకాల సౌకర్యాలు కల్పించేందుకు అవసరమైన నిధులను మంజూరు చేసేందుకు కృషి చేస్తానని మంత్రి అన్నారు. మేడ్చల్ నియోజకవర్గం పరిధిలోని తహశీల్దార్లు కళ్యాణలక్ష్మీ, షాదీముబారక్‌కు సంబంధించివి పెండింగ్‌లో ఉండకుండా చూడటంతోపాటు వాటిని ఎప్పటికప్పుడు లబ్ధిదారులకు అందించాలన్నారు. డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను ప్రారంభించడానికి సిద్ధంగా ఉంచాలని సూచించారు. ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించే సీఎం కప్- 2023 నిర్వహణపై పూర్తి స్థాయిలో అన్ని రకాల ఏర్పాట్లు చేయాలని తహశీల్దార్లను మంత్రి ఆదేశించారు.

ఎంతో ఆనందంగా ఉంది: కలెక్టర్ అమయ్‌కుమార్

మేడ్చల్ నియోజకవర్గంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయని, ప్రభుత్వం కూడా ప్రతి అభివృద్ధి కార్యక్రమాన్ని ఇక్కడి నుంచే ప్రారంభించడం, విజయవంతం కావడం ఎంతో ఆనందంగా ఉందని జిల్లా కలెక్టర్ అమయ్‌కుమార్ తెలిపారు. మేడ్చల్ అభివృద్ధిలో ఎంతో పేరు ప్రఖ్యాతలు సంపాదించిందని, ప్రభుత్వ ప్రాధాన్యతలకు అనుగుణంగా ప్రజల అవసరాలను తీర్చేందుకు అధికార యంత్రాంగం నిరంతరం సహకరిస్తోందని అన్నారు. ఈ సందర్భంగా మేయర్లు, మున్సిపల్ చైర్మన్లు, పలువురు ప్రజాప్రతినిధులు తమ పరిధిలోని పెండింగ్ సమస్యలను జిల్లా కలెక్టర్ అమయ్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లగా, వాటిని అప్పటికప్పుడే పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్లు ఏనుగు నర్సింహారెడ్డి, అభిషేక్ అగస్త్య, జిల్లా రెవెన్యూ అధికారి లింగ్యానాయక్, ఆర్డీవో మల్లయ్య, ఆర్అండ్‌బీ అధికారి శ్రీనివాస్ మూర్తి, పీఆర్ ఈఈ రామ్మోహన్, డీపీఓ రమణమూర్తి, వివిధ శాఖల జిల్లా అధికారులు, మేయర్లు జక్కా వెంకట్‌రెడ్డి, మేకల కావ్య, బుచ్చిరెడ్డి, మున్సిపల్ చైర్మన్లు కొండల్‌రెడ్డి, చంద్రారెడ్డి, ప్రణీత, తహశీల్దార్లు గౌతమ్‌కుమార్, గౌరీ, విజయలక్ష్మీ, మున్సిపల్ కమిషనర్లు వాణి రెడ్డి, స్వామినాయక్, సురేష్‌కుమార్ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.